సురక్షిత ప్రయాణానికి ప్రత్యేక చర్యలు

- రోడ్డు నిబంధనలు పాటించండి.. ప్రాణాలు కాపాడుకోండి
- ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేలా డ్రైవ్‌లు
- కంచరపాలెం ట్రాఫిక్ పోలీసుల అవగాహన కార్యక్రమాలు

మర్రిపాలెం: వాహన చోదకుల సురక్షిత ప్రయాణానికి ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఇటీవల కాలంలో ట్రాఫిక్ సమస్యలు ఎక్కువైపోయాయి. కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో తాటిచెట్లపాలెం నుంచి ఎన్ఏడీ వరకు గల బీఆర్‌టీఎస్ రోడ్డులో దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. వాహనాల పార్కింగ్‌కు నిర్ణీత స్థలం లేక.. ఒక వేళ ఉన్నా తోపుడు బళ్లు, పాన్‌షాపులు తదితర చిరు వ్యాపారులు వాటిని ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్న తరుణంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఫుట్‌పాత్ ఆక్రమణలు, రాంగ్ పార్కింగ్, తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు వంటి విషయాలపై ట్రాఫిక్ పోలీసులు సుమారు వారానికి రెండు, మూడు సార్లు దృష్టి సారించి తగు చర్యలు చేపట్టి జరిమానాలు విధిస్తున్నారు.


హెల్మెట్ ధారణ ప్రాధాన్యాన్ని వివరిస్తున్న ట్రాఫిక్ పోలీస్


బీఆర్‌టీఎస్ రోడ్డులో ఫుట్‌పాత్ ఆక్రమణను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ట్రాఫిక్ నిబంధనలపై స్పెషల్ డ్రైవ్‌లు

కంచరపాలెం ఐదో పట్టణ ట్రాఫిక్ పోలీసులు రోడ్డు భద్రతా నిబంధనలపై స్పెషల్ డ్రైవ్‌లను ఎప్పటికప్పుడు నిర్వహిస్తున్నారు. వాటిలో ముఖ్యంగా జాతీయ రహదారి తాటిచెట్లపాలెం నుంచి ఎన్ఏడీ వరకు.. అటు బీఆర్‌టీఎస్ మార్గంలో కంచరపాలెం మెట్టు నుంచి ఎన్ఏడీ వరకు రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న దుకాణాలు, షాపులు, రాంగ్ పార్కింగ్ వాహనాలను తొలగిస్తూనే ఉన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించకుండా సహకరించాలని కోరుతున్నారు.


దృశ్య వాహనం ద్వారా రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

అన్ని కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచి అతివేగంగా వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకుని జరిమానాలు వేస్తున్నారు. అతి వేగం వల్ల కలిగే నష్టాలను వాహన చోదకులకు కౌన్సెలింగ్ పెట్టి వివరిస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై ఉక్కుపాదం మోపుతున్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపకూడదని, ఆ సమయంలో ఎక్కడికైనా వెళ్లాల్సి వస్తే డ్రైవరును పెట్టుకుని ప్రయాణించాలని అనేక సార్లు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అతివేగం వల్ల వాహనం నడిపే వారితో పాటు రోడ్డున ప్రయాణించేవారు వారి తప్పు లేకుండా ప్రాణాలు కోల్పోయిన పరిస్థితులు గతంలో చాలా జరిగాయి. ఈ సంఘటనలకు సంబంధించి దృశ్య వాహనాల ద్వారా పలు కాలేజీల దగ్గర, ముఖ్యమైన కూడళ్లలో ప్రదర్శించి వాటిని యువతకు చూపించి జాగ్రత్తలు సూచిస్తున్నారు. హెల్మెట్ ధరించని వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. ట్రాఫిక్ రూల్స్‌కు సంబంధించి ఎక్కడికక్కడ బోర్డులను ఏర్పాటు చేశారు. వాటిపై మార్గాలు చూపించడమే కాకుండా నిబంధనలు ఉల్లంఘిస్తే దేనికి ఎంత జరిమానా విధిస్తారో అందులో పొందుపరిచారు. తద్వారా వాహన చోదకుల్లో చైతన్యం పెంపొందేలా ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.

వాహన చోదకుల భద్రతే ముఖ్యం



రోడ్డు ప్రమాదాల నియంత్రణకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. ప్రధానంగా బీఆర్‌టీఎస్ రోడ్డులో వాహనాల రాంగ్ పార్కింగ్, చిరు వ్యాపారాలు చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టి కొంతమేర నివారించాం. ఫుట్‌పాత్ ఆక్రమణలు చాలా వరకు తగ్గాయి. కంచరపాలెం ప్రధాన కూడళ్లలో ప్లకార్డులతో హెల్మెట్ ధరించమని అవగాహన కల్పిస్తున్నాం. నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తున్నాం. వాహన చోదకుల్లో చైతన్యం నింపడం కోసం ప్రత్యేక డ్రైవ్‌లు చేపడుతున్నాం.

– మళ్ల అప్పారావు, ట్రాఫిక్ సీఐ, కంచరపాలెం

ప్లాస్టిక్ నియంత్రణలో డీఆర్‌వోపీ సేవలు భేష్



డీఆర్‌వోపీ లోగో, జూట్ బ్యాగులు ఆవిష్కరిస్తున్న అదనపు కమిషనర్ సన్యాసిరావు తదితరులు

ఎంవీపీ కాలనీ: ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణకు డెవలప్ రెస్పాన్సిబుల్ అవుట్‌లుక్ ఫర్ ప్లాస్టిక్(డీఆర్‌వోపీ) అందిస్తున్న సేవలు అభినందనీయమని జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు అన్నారు. డీఆర్‌వోపీ విశాఖలో సేవల ప్రారంభ కార్యక్రమాన్ని బుధవారం లాసన్స్‌బే కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌వోపీ లోగోతో పాటు జూట్ బ్యాగ్‌లను ఆవిష్కరించారు. బీచ్ క్లీనింగ్ ప్రొగ్రాంను సైతం ప్రారంభించారు. అనంతరం సన్యాసిరావు మాట్లాడుతూ వ్యర్థాలతో పాటు ప్లాస్టిక్ నియంత్రణలోను నగర వాసులను పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలని సూచించారు. గత కొంత కాలంగా ఐపీసీఏ, కియా ద్వారా వ్యర్థాలు, ప్లాస్టిక్ నియంత్రణకు అందిస్తున్న సేవలను కొనియాడారు. ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ కౌసికా సరవరణ్ మాట్లాడుతూ ఇండియన్ పొల్యూషన్ కంట్రోల్ అసోసియేషన్, కియా ఇండియా అసోసియేషన్ సంయుక్త సహకారంతో డీఆర్‌వోపీ సేవలను ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటికే బెంగళూరు, ముంబయి, విజయవాడ, గుర్‌గ్రామ్‌లలో సంస్థ ద్వారా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. వ్యర్థాల నియంత్రణపై అవగాహన, రీసైక్లింగ్ అంశాల్లో వినియోగదారుల భాగస్వామ్యం పెంచడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఈ మేరకు విద్యార్థులు భాగస్వామ్యంతో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు, అపార్టుమెంట్‌ల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోన్–2 కమిషనర్ విజయలక్ష్మి, జీవీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక కార్యక్రమాలు


సీఐ విజయకుమార్‌కు మొక్క బహూకరిస్తున్న కీర్తి పట్నాయక్

మురళీనగర్: నగరంలో పర్యావరణ పరిరక్షణకు విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రత్యేక చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ట్రస్టు వ్యవస్థాపకురాలు కుప్పిలి కీర్తిపట్నాయక్ తెలిపారు. ఈమేరకు మొక్కలు నాటడం, వాటి పరిరక్షణకు సంబంధించి ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు. ఈమేరకు జీవీఎంసీ ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీనివాస్ రాజమణి, ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ ఎస్.విజయకుమార్‌లను బుధవారం ఆమె మర్యాద పూర్వకంగా కలిసి పర్యావరణ పరిరక్షణపై వారి సలహాలు తీసుకున్నట్లు చెప్పారు. వారికి మొక్కలను బహుమతిగా అందించానన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం


సురేష్ తల్లికి నగదు అందిస్తున్న అల్లు అర్జున్ ఆర్మీ టీమ్స్ ప్రతినిధులు

మర్రిపాలెం: ఇటీవల కరెంట్ షాక్‌కు గురై మృతి చెందిన సురేష్ కుటుంబానికి అల్లు అర్జున్ ఆర్మీ టీమ్స్ ప్రతినిధులు ఆర్థిక సాయం అందించారు. మర్రిపాలెంలో నివసిస్తున్న మృతుడి తల్లికి బుధవారం అల్లు అర్జున్ ఆర్మీ వైజాగ్ టీం, ఆంధ్ర టీమ్స్, తెలంగాణ టీమ్స్ అంతా రూ.70 వేలు సేకరించి, నిర్మాత ఎస్‌కేఎన్ అందించిన రూ.25 వేలను కలిపి మొత్తం రూ.95 వేల నగదును అందజేశారు. తామున్నామని ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించారు.

నాగన్న గెడ్డలో పూడిక తొలగింపు


గెడ్డలో పూడిక తీస్తున్న సిబ్బంది

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలోని నాగన్న గెడ్డలో పూడికలను బుధవారం పారిశుధ్య సిబ్బంది తొలగించారు. ఈ గెడ్డలో పూడికలు నిండిపోయాయి. విషయం తెలుసుకున్న వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ దొర సిబ్బందితో కలిసి పూడికలు తీయించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆళ్ల శ్రీనివాసరావు పనులను పర్యవేక్షించారు. మిగిలిన గెడ్డలను కూడా ఎప్పటికప్పుడు శుభ్రం చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆయన కోరారు.

ఎరుకుమాంబ ఆలయంలో 18న శివరాత్రి ఉత్సవాలు


ప్రత్యేక అలంకరణలో ఎరుకుమాంబ

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారి ఆలయంలో ఈ నెల 18న మహా శివరాత్రి మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఈవో రమాబాయి తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అమ్మవారికి కుంకుమార్చనలు, దర్శనలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు పురవీధుల్లో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ప్రత్యేక ఆహ్వానితులుగా దేవదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఎం.వెంకటసురేష్‌బాబు, ఉప కమిషనర్ ఎస్.సుజాత, సహాయ కమిషనర్ కె.శిరీష పాల్గొంటారని అన్నారు.

ఉద్యోగం సాధించడం ఒక వరం

మురళీనగర్: డిప్లమో స్థాయిలో పాలిటెక్నిక్ విద్యార్థులు ఉద్యోగం సాధించడం వరమని, దీన్ని సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. బెంగళూరుకు చెందిన నెట్టూర్ టెక్నికల్ ట్రైనింగ్ ఫౌండేషన్(ఎన్‌టీటీఎఫ్) ఇటీవల నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఈ కళాశాల నుంచి 13 మంది బాలికలు ఉద్యోగాలు పొందారు. ఈ నేపథ్యంలో వీరి తల్లిదండ్రులు, కంపెనీ ప్రతినిధులతో బుధవారం ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా ఉద్యోగులకు కంపెనీలో పూర్తి రక్షణ ఉంటుందని వివరించారు. బాలికల తల్లిదండ్రులు అడిగిన పలు సందేహాలను ఎన్‌టీటీఎఫ్ ప్రతినిధులు నివృత్తి చేశారు. ఉద్యోగంలో చేరిన వారందరికీ రెండు నెలలు శిక్షణ ఇస్తామన్నారు. ఇందులో భాగంగా సాంకేతిక నైపుణ్యాలు, సాఫ్ట్ స్కిల్స్, సేఫ్టీ, సమగ్ర అభివృద్ధి వంటి అంశాల్లో శిక్షణ ఉంటుందని, అభ్యర్థులు శ్రీపెరంబదూర్‌లోని ఫస్ట్ సోలార్ కంపెనీలో పని చేయాల్సి ఉంటుందని చెప్పారు. అమెరికా, మలేసియా, వియత్నాం వంటి దేశాల్లోని ఫస్ట్ సోలార్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో కంపెనీ స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం మేనేజర్ సీపీ రమేష్ బాబు, సీనియర్ ఆఫీసర్ ఎస్.గీత, మెయింటినెన్స్ ఇంజినీర్ బి.సాహుల్ ఇబ్రహీం, హెచ్ఆర్ విభాగం ప్రతినిధులు దియానా సీక్విరా, నిర్మలా దేవి, నివేదా, కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ వివిధ విభాగాల హెడ్‌లు డాక్టర్ బీవీ లక్ష్మణరావు, డాక్టర్ ఎస్.ప్రశాంతకుమారి, డి.దామోదర్, టీపీవో సీహెచ్ జయప్రకాష్‌రెడ్డి, ఏటీపీవో కుమార్ పాల్గొన్నారు.


క్యాంపస్ ఉద్యోగార్థుల తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటరమణ

అవగాహనతోనే క్యాన్సర్‌కు చెక్

ఎంవీపీ కాలనీ: ముందస్తు అవగాహనతో క్యాన్సర్ నివారణ సాధ్యమవుతుందని ఎంవీపీ కాలనీ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మావతి అన్నారు. కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం హెల్త్ సెక్రటరీలతో కలిసి విద్యార్థులను భాగస్వాములను చేస్తూ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ ముందస్తు గుర్తింపు, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లుతో క్యాన్సర్‌కు అడ్డుకట్ట వేయవచ్చన్నారు. పొగాకు ఉత్పత్తుల వినియోగానికి ప్రజలు దూరంగా ఉండాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బ్లాక్ లెవల్ హెల్త్ మేళా పేరుతో ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు.

నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

నూతన నియామకం


ఉమామహేశ్వరరావుకు నియామకపత్రం అందజేస్తున్న కొణతాల శ్రీనివాస్, సభ్యులు

దాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన కులాల సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర కోశాధికారిగా ప్రముఖ విద్యాసంస్థల అధినేత ఎం. ఉమామహేశ్వరరావు నియమితులయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొణతాల శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘానికి సంబంధించి పలు విషయాలు చర్చించారు. అనంతరం ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో కోశాధికారిగా నియమించడం సంతోషకరమని, బాధ్యతతో సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘం పేరిట త్వరలోనే వృద్ధాశ్రమం నిర్మించే ఆలోచనలో ఉన్నామని, అందుకు సంఘం కోర్ కమిటీ నిర్ణయం తీసుకుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఆలేటి హేమలత, కోటా రమేష్, ఆర్‌వీ గోవిందరావునాయుడు, సీహెచ్ వెంకటేశ్వరరావు, కొయ్య రామకృష్ణ, కొణతాల రాధ, అక్కునాయుడు, సత్యనారాయణాచారి, త్రినాథ్, రాందేవ్, కాత్యాయిని తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి 'సహజ యోగం'పై అవగాహన సదస్సులు

దాబాగార్డెన్స్: సహజ యోగం.. నేటి మహాయోగమని మాతాజీ నిర్మలాదేవి సహజ యోగ ట్రస్ట్ ఆంధ్రప్రదేశ్ సభ్యులు తెలిపారు. ఏయూ కాన్వొకేషన్ హాల్లో ఈ నెల 17 నుంచి 19 వరకు మూడు రోజుల పాటు సహజ యోగ ధ్యానంపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు ట్రస్ట్ ఏపీ కో ఆర్డినేటర్ కె. స్వామిబాబు, మహిళా కో ఆర్డినేటర్ పద్మావతి, సభ్యులు మధుసూదన్, కెప్టెన్ బాబూరావు, రామకృష్ణ తెలిపారు. బుధవారం నగరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కార్యక్రమ వివరాలు వెల్లడించారు. మాతాజీ నిర్మలాదేవి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా సహజ యోగ ధ్యానంపై ప్రత్యేక కార్యక్రమంతోపాటు శిక్షణ ఇస్తామని చెప్పారు.

శివపార్వతుల కల్యాణోత్సవం నేడు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో మాఘ మాసం, బహుళ ఏకాదశిని పురస్కరించుకుని గురువారం వార్షిక కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు అర్చకుడు రామారావు శర్మ తెలిపారు. ఉదయం 8 గంటలకు శివపార్వతుల మూలవిరాట్ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు, సాయంత్రం 4 గంటలకు పల్లకీలో తిరువీధి ఊరేగింపు, సాయంత్రం 6.30 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో వైభవంగా కల్యాణ మహోత్సవం జరుగుతాయని చెప్పారు. కల్యాణంలో పాల్గొనే భక్తులు రూ.300 చెల్లించి రసీదు పొందాలన్నారు. ఈ నెల 18న మహాశివరాత్రి సందర్భంగా ఉదయం 4.30 గంటల నుంచి స్వామి దర్శనాలు, ఏకవారాభిషేకాలు చేస్తామని తెలిపారు. రాత్రి 10 గంటల నుంచి లింగోద్భవకాల సమయంలో సామూహిక మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన అనంతరం తీర్థప్రసాద వితరణ చేస్తామన్నారు. రాత్రి అభిషేకం పూజలకు భక్తులు రూ.100 చెల్లించి రసీదు పొందాలని కోరారు.


శివలింగానికి అభిషేకం చేస్తున్న రామారావు శర్మ

10 కిలోల గంజాయి స్వాధీనం

పోలీసుల అదుపులో ముగ్గురు వ్యక్తులు

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ముగ్గురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. వారు తెలిపిన వివరాలిలా.. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వే స్టేషన్ రిజర్వేషన్ కౌంటర్ వద్ద గంజాయి రవాణా జరుగుతోందనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు అనుమానస్పద వ్యక్తుల వద్ద సోదాలు చేశారు. 10 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి ముగ్గురు వ్యక్తుల నుంచి దానితోపాటు రూ.1,500 స్వాధీనం చేసుకుని ఫోర్త్ టౌన్ పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథరావు మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ ఆదేశాల మేరకు స్పెషల్ బ్రాంచ్ అడిషనల్ కమిషనర్ గంగాధర్ పర్యవేక్షణలో సోదాలు చేశామన్నారు. కేరళ తిరువనంతపూర్‌కు చెందిన సురేష్‌కుమార్, అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట బొడ్డపుట్టుకు చెందిన మజ్జి బాలకృష్ణ, మజ్జి అరుణలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.


స్వాధీనం చేసుకున్న గంజాయి, నగదు

మహాభారతంపై సాహిత్య ప్రసంగం

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రిజమ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మహాభారతంలో విశేషాంశాలు అనే అంశంపై సాహితీవేత్త టీపీఎన్ ఆచార్యులు ప్రసంగించారు. ముందుగా వ్యాసుని జన్మవృత్తాంతం.. ఆపై సహస్ర కవచ రాక్షసుడితో నరనారాయణుల యుద్ధం, ఒక్క కవచంతో సూర్యుడి శరణు వేడుట అతడే కర్ణుడిగా జన్మించడం, వాని సంహారానికి నరనారాయణులు కృష్ణార్జునులుగా పుట్టారని తెలిపారు. శకుంతలో పాఖ్యానం, ఉడిపి రాజు అనే సూరసేనుడు కురుక్షేత్ర సంగ్రామంలో ఇరుపక్క సైనికులకు ఆహారం వండి పెట్టడం, కలి ప్రవేశం, పరీక్షిత్తు క్రోధం, శృంగి శాపం, యాదవుల నాశనానికి కారణం వంటి విశేషాంశాలను కళ్లకు కట్టినట్టు వివరించారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ మహాభారతంలో ఎన్నో ధర్మ సూత్రాలు, జీవిత సత్యాలు నిక్షిప్తమై ఉన్నాయన్నారు. మహాభారతం నేటికీ మనందరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు కె.జి.వేణు, డి.వి.సూర్యారావు, పరవస్తు ఫణిశయనసూరి, చిన సూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణమూర్తి, అయ్యల సోమయాజుల ప్రసాద్, గండికోట విశ్వనాథం, రామతాత, మాణిక్యాలరావు చర్చించారు.



ప్రసంగిస్తున్న సాహితీవేత్త టీపీఎన్ ఆచార్యులు

21న నీలమాంబేశ్వరి పరస

అల్లిపురం: అచ్చియ్యమ్మపేట, యాతపేటరోడ్డులో వెలసిన నీలమాంబేశ్వరి అమ్మవారి పరస మహోత్సవం ఈ నెల 21న ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు రీసు చంద్రరావు తెలిపారు. ఈ సందర్భంగా 20వ తేదీ సోమవారం ఉదయం అమ్మవారి తొలేళ్ల చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం అమ్మవారి విగ్రహానికి జలాభిషేకం, అంతకు ముందు కలశాలతో భారీ ఊరేగింపు, సాయంత్రం భజన కార్యక్రమం ఉంటుందన్నారు. 21వ తేదీ ప్రధాన పండగ రోజున ఉదయం 6 గంటల నుంచి అమ్మవారికి విశేష పూజలు, భక్తులకు దర్శనాలు ఉంటాయన్నారు.

సమాచారమ్

పారిశుధ్య సమస్యా.. ఫోన్ చేయండి

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5 పరిధిలో ప్రజా ఆరోగ్యం, పారిశుధ్య సమస్యలపై సంబంధిత అధికారుల ఫోన్ నంబర్లకు కాల్ చేసి తెలియజేయవచ్చు. ఉత్తర నియోజకవర్గంలోని 42వ వార్డు నుంచి 51, 53, 54, 55 వార్డుల వరకు గల 13 వార్డులకు సంబంధించి రహదారుల శుభ్రత, చెత్త సేకరణ–తొలగింపు, గెడ్డలు, కాలువల్లో పూడిక తీత మొదలగు పనుల విషయంలో పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే.. ఆయా వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్లకు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చు. వారు స్పందించని పక్షంలో జ్ఞానాపురంలోని జోన్–5 కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో ఫిర్యాదులు చేయవచ్చని పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, సూపర్ వైజర్ జనార్దన్‌లు తెలిపారు.


కాలువ శుభ్రతను పరిశీలిస్తున్న జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ(ఫైల్)

వార్డు నం.	అధికారి పేరు	బాధ్యత	ఫోన్ నంబర్
జోన్-5	డాక్టర్ రాజేష్	ఏఎంహెచ్‌వో(పబ్లిక్ హెల్త్)	99480 95520
జోన్-5	ఎస్.జనార్దన్	సూపర్‌వైజర్(పబ్లిక్ హెల్త్)	99121 99283
42	ఎం.సన్యాసిదొర	హెల్త్ అసిస్టెంట్	99488 83942
43	అప్పలరాజు	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99665 91821
44	ఎన్.సూరిబాబు	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83932
45	కె.పాండురంగా	హెల్త్ అసిస్టెంట్	99488 83913
46	వి.సత్యం	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83970
47	కె.వి.రమణమూర్తి	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83937
49	ఎం.రామకృష్ణ	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83943
50	బి.సుధాకర్	శానిటరీ ఇన్‌స్పెక్టర్	94941 83244
51	ఎ.కృష్ణ	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83949
53	పి.టి.తులసీ	సచివాలయ కార్యదర్శి	99490 98777
54	వై.త్రిమూర్తులు	పబ్లిక్ హెల్త్ మేస్త్రీ	99488 83947
55	యు.కార్తీక్	హెల్త్ అసిస్టెంట్	91105 97632

మహా శివరాత్రికి తీరం ముస్తాబు

బీచ్ రోడ్డు: మహా శివరాత్రి వేడుకలకు సాగర తీరం ముస్తాబవుతోంది. జాగరణ కోసం వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. టి.సుబ్బరామిరెడ్డి కళా పీఠం ఆధ్వర్యంలో ఆర్కే బీచ్‌లో శనివారం నిర్వహించనున్న మహా కుంభాభిషేకం కోసం ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.


సాగర తీరంలో ఏర్పాటు చేస్తున్న మహా శివలింగం

హెచ్‌పీసీఎల్‌లో ఏయూ విద్యార్థుల ఇంటర్న్‌షిప్ పూర్తి

ఏయూ క్యాంపస్: హెచ్‌పీసీఎల్‌లో ఏయూ వృక్షశాస్త్ర విభాగం విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌ను పూర్తి చేశారు. ఏయూతో గతంలో హెచ్‌పీసీఎల్ చేసుకున్న అవగాహన ఒప్పందంలో భాగంగా హెచ్‌పీ హరిత ప్రాజెక్టును ప్రారంభించారు. దీనిలో ఏయూ వృక్షశాస్త్ర విభాగానికి చెందిన విద్యార్థులు వృక్ష సంబంధ అధ్యయనం చేశారు. హెచ్‌పీసీఎల్‌కు చెందిన వాల్తేర్ పార్క్, యారాడ హౌసింగ్ కాలనీలో ఉన్న వృక్ష సముదాయం, అరుదైన మొక్కలపై పీజీ విద్యార్థులు పరిశోధన జరిపారు. అదే విధంగా ఆయా ప్రాంతాలలో నూతనంగా ఉద్యానవనాల అభివృద్ధికి పలు సూచనలు చేశారు. విజయవంతంగా ఇంటర్న్‌షిప్‌ను పూర్తిచేసిన విద్యార్థులకు హెచ్‌పీసీఎల్ సంస్థ సర్టిఫికెట్లను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా విద్యార్థులను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి బుధవారం తన కార్యాలయంలో అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి